ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 11 నవంబరు , 2024 | పేజీలు :7

## ఇరుకు రోడ్లలో మలుపు తిప్పడం ఎలా..?



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్ :**పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు గల దారిలో వాహనాలు ఎక్కడ మలుపు తిప్పాలన్నా తిప్పలు తప్పడం లేదు. రోడ్డు ఇరుకుగా ఉండి దాని మధ్యలో డివైడర్లు ఉండడం, రోడ్డు వెంట ఉన్న షాపులకు పార్కింగ్ లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ఉత్కూర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు మధ్యలో ఎక్కడ యూ టర్న్ తీసుకోవాలన్న ఇబ్బందులు పడాల్సి వస్తుంది.అంతేకాకుండా లారీలు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలు యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అప్పటి రాజకీయనాయకుల స్వలాభం కొరకు వారి భవనాలు, దుకాణాల సముదాయాలు నష్టపోవాల్సి వస్తుందని రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని అడ్డుకున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన దారి వెంట ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టి పనులు పూర్తి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ







**ప్రజాపక్షం/సారంగాపూర్ :**వరి ధాన్యం కొనగోలు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.ఆదివారం ఆలూరు గ్రామంలో జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించా రు .కొనుగోలు కేంద్రంలో రైతులకు త్రాగునీరు .టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు.నిర్ణీత తేమశాతం రాగానే ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించాలన్నా.ధాన్యం సేకరించిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను తప్పకుండా పూర్తి చేయాలన్నారు.ఆధార్,బ్యాంకు పాస్‌బుక్,తదితర పత్రాల జిరాక్స్ కాఫీలను తీసుకొని త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే విధంగా చూడాలన్నారు.సన్నధాన్యం,దొడ్డుధాన్యం వివరాలను ఆన్‌లైన్ లో నమోదు సందర్భంగా జాగ్రత్తగా నమోదు చేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని టార్పాలిన్లు,తూకపు,తేమ యంత్రాలు,గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ప్యాడి క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.రైతులకు వరి ధాన్యం కొనుగోలు పై ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ ను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒరత్నకళ్యాణీ,డిఆర్‌డిఒవిజయలక్ష్మి , సారంగాపూర్‌ఎంపీఓఅజీజ్ ,వ్యవసాయ శాఖ అధికారులు ,రైతు లు,సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్లక్ష్యమా...నిఘా లోపమా?

***జోరుగా అక్రమ ఇసుక రవాణా**

***అడ్డుకోలేకపోతున్న అధికారులు**



**ప్రజాపక్షం/చందుర్తి:**అధికారు నిర్లక్ష్యమో లేక నిఘాలోపమో తెలియదు గాని మండల వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది.సామాన్యుల గృహ నిర్మాణ అవసరాలను ఆసరాగా చేసుకున్న ఇసుకాసురులు స్థానిక ఒర్రెలలో నుండి ఇసుకను తీస్తూ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండల ప్రజలు అన్నా రు .ప్రతి రోజు రాత్రి వేళలో, ముఖ్య ంగా సెలవు రోజుల్లో రాత్రి పగలు తేడా లేకుండా జోరుగా ఇసుక రవాణా సాగుతోందని ట్రా క్టర్ల శబ్దాల వల్ల రాత్రి వేళల్లో నిద్ర పోలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.కొన్ని సార్లు మైనర్లే ట్రాక్టర్లు నడుపుతున్నారని దాని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు.అక్రమ ఇసుక రవాణాని అధికారులు అడ్డుకోలేక పోతున్నారని,ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కొనండి... తాగండి.... చావండి...



**ప్రజాపక్షం /సుల్తానాబాద్:**మీకు సగం ధరలో చిల్డ్ బీరు కావాలా వచ్చేయండి సుల్తానాబాద్ కు 320 రూపాయల విలువగల కె ఎఫ్ అల్ట్రా బీరు ను కేవలం 150 రూపాయలకే అందిస్తున్న సుల్తానాబాద్ లోని ప్రముఖ మద్యం దుకాణం. సుల్తానాబాద్ పట్టణంలో ఆరు వైన్సులు, ఒక బార్ అండ్ రెస్టారెంట్ తో పాటు మండలంలో రెండు మద్యం దుకాణాలు కలవు. తాజాగా సుల్తానాబాద్ లోని కొన్ని మద్యం దుకాణాలలో మందుబాబులపై దయ తలచి పండుగ వేళ కాకున్నా ప్రత్యేక ఆఫర్లను పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కొనసాగుతుండగా కేవలం సుల్తానాబాద్ లో బీర్ల ను సగం ధరలో అందించడం లో ఆంతర్యం ఏమిటి అని మద్యంప్రియులు గుసగుసలాడుతున్నారు. సుల్తానాబాద్ మండలం వ్యాపార సముదాయాలకు పెట్టింది పేరు కావడంతో ఇక్కడ వ్యాపారస్తులు ఇష్టా రీతిలో వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. పట్టణ కేంద్రంలో పలు మద్యం దుకాణాలలో కాలపరిమితి సమీపించిన బీర్లను సగం ధరలో అమ్మడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా ఇష్టా రీతిన సగం ధరకే వ్యాపారస్తులు బీరు బాటిల్ లను అంటగడుతున్నారు. మద్యం ప్రియులు వారికి నచ్చిన బీర్లను అడగగా వాటిని అందుబాటులో లేకుండా చేసి ప్రముఖ కంపెనీకి చెందిన బీర్లు సగం ధరకే రావడం జరుగుతుందని వాటిని అంటగడుతున్నారు. కల్తీ బీరుపై గత మూడు రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకపోకపోవడం విడ్డూరం. సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా గల మద్యం దుకాణాలలో కల్తీ బీర్లు వచ్చిన వాటిపై నిలదీసిన పట్టించుకున్న నాధుడే లేదు.

తాజాగా సుల్తానాబాద్ పట్టణంలోని ఒక వార్డుకు చెందిన కొంతమంది యువకులు సమీపంలోని ఒక మద్యం దుకాణంలో మూడు కాటన్ల బీర్లు కొనుగోలు చేయగా వాటిలో ఒక బీరు సీసాలో చెత్తా చెదారం రావడంతో ఆశ్చర్యపోయారు. దీనిపైమద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులను అడగగా వారు బీరు కాటన్ లు కొనుగోలు చేసిన వారిపై దురుసుగా ప్రవర్తించారు. . పై విషయం పై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా సుల్తానాబాద్ మద్యం దుకాణంలో ప్రస్తుతం బీర్ల కొరత ఏర్పడిందని మండల వ్యాప్తంగా ఎక్కడ కల్తీ బీర్లు వచ్చే ఆస్కారం లేదని అంతేకాకుండా కాల పర్మితి సమీపించిన బీర్లు సైతం వచ్చే ఆస్కారం లేదని చెప్పడం ఒంకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా అధికారులు మామూళ్ల మత్తును వీడి మండల వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## త్రివేణి సంఘమాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామ త్రివేణి సంఘమాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం రెంజల్ మండలం కందకుర్తి గ్రామ త్రివేణి సంఘమాన్ని సందర్శించి, గోదావరి గంగా నదికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతిని ఇచ్చారు. గ్రామంలోని ప్రసిద్ధ రామాలయంలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలలో భాగంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డా.హెగ్డేవార్ పూర్వీకుల స్థలంలో రూ.45కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కేశవరావు బలిరాం హెగ్డేవార్ స్ఫూర్తి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టిన తాను కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా ఎన్నిక కావడానికి కారణం స్వయం సేవక్ సంఘమేనని, తనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖ సంస్కారం ఇచ్చిందని తెలిపారు. రాయిని శిల్పంగా మార్చేది సంఘమేనని, జీవితంలో సంస్కారం నైతిక విలువలు లేకుంటే మనిషి పతనమని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన దేశాన్ని ప్రపంచంలో మూడవ అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు పని చేయడమే కాకుండా భారత సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని తెలిపారు. ప్రసిద్ధ త్రివేణి సంఘమం గల కందకుర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీనిచ్చారు. నదులు, ప్రకృతి కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్తీక మాసంలో గోదావరి నది హారతి ఇవ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నది స్నానం ఎంతో పవిత్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశవ సేవా సమితి అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ నాయకులు హన్మంత్ రావు, గోవిం ద్,రమేష్,స్వయంసేవకులు, బిజెపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/చిగురుమామిడి :**చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200001 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దాదాపు 100 మంది పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా ఆడుతూ పాడుతూ గడిపారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి గురించి ఒకరినొకరు పలకరించుకున్నారు. కుటుంబ సమస్యలు, ఉద్యోగాలు, బిజీబిజీ జీవితంలోనూ అందరూ ఒకే చోట కలవడంతో పండగ వాతావారణం నెలకొంది. నాడు చదువు చెప్పిన గురువులను పిలిపించుకుని శాలువాలు కప్పి మెమొంటోలు అందజేసి గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ఎవరికి ఆపద వచ్చినా తోచిన సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, రవీందర్, రమణయ్య, హరీఫ్, మునిప్రసాద్, సిహెచ్ రాము, స్కూల్ హెచ్ఎం సి.హెచ్ జయప్రద, నడిగొట్టు తిరుపతి, పూర్వ విధ్యార్థులు నేదునూరి సత్యనారాయణ, గాదె రఘునాథ్‌రెడ్డి, జెల్ల శ్రీనివాస్, బత్తిని చంద్రశేఖర్, కోకొండ సంతోష్ కుమార్, మంతీన సాంబమూర్తి, దుస్స మహేందర్, జెల్ల కిసాన్, జగన్, మధు, మోహన్‌రెడ్డి, అప్పల మల్లయ్య, అందె సరయ్య, కున సదయ్య, డి.కుమారస్వామి, కమఠం స్వప్న, తుముల మమత, స్రవంతి, రజిత, లక్ష్మి లున్నారు.

## కొనసాగుతున్న సర్వే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిసి కులగణన ఆసిఫాబాద్ మండలంలో కొనసాగుతోంది. ఆదివారం మండలంలోని బాబపూర్ గ్రామ పంచాయతీలో కుల గణన సర్వేలో అధికారులకు ప్రజలు తమ కుటుంబానికి చెందిన పూర్తి సమాచారాన్ని అందించారు. ఈ సర్వేలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాసాదే చరణ్, బాబాపూర్ గ్రామ ప్రజలు సెల్వట్ కార్ బుద్ధు,దుప్తిహన్మంత్,సాగర్,వినోద్, స వాయి మహేందర్ కార్యకర్తలు పాల్గొన్నా రు.

## పేదింటి యువతి వివాహానికి చేయూత

**ప్రజాపక్షం/జన్నారం:**అమ్మ నాన్న లేని నిరుపేద అమ్మాయి వివాహానికి జక్కు భూమేష్ ఆర్థిక సహాయం అందజేశారు. జన్నారం మండల పరిధిలోని పొనకల్ గ్రామానికి చెందిన క్రీర్తిశేషులు మేకల రమేష్ లక్ష్మిల ద్వితీయ పుత్రిక శ్రీవాణి వివాహం నిశ్చయమైంది. ఈ నెల 17వ తేదిన శ్రీవాణి వివాహం జరగనుంది. యువతి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని ఆదివారం జక్కు భూమేష్, దుమల్ల ఎల్లయ్య రెడ్డి, సాయి పెళ్లి కూతురికి కావలసిన మట్టెలు, పుస్తెలతో పాటు నగదు కానుకగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు మద్రిపెల్లి అంజయ్య, యువశక్తి యూత్ అధ్యక్షుడు కుదురుపాక పవన్ కళ్యాణ్, యూత్ గౌరవ అధ్యక్షులు మద్రిపెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక్క అవకాశం ఇవ్వండి.. ఎంఎల్‌సి అభ్యర్థి నాగయ్య




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, పట్టభద్రుల ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులందరూ రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలపై, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల, పాఠశాలల్లో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయ అధ్యాపక సమస్యలపై గత 18 సం॥ నుండి నిరంతరం పోరాటం చేస్తున్నామని, యజమాన్య సమస్యలు గానీ ఇటు అధ్యాపక సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ప్రైవేటు ఉపాధ్యాయ అధ్యాపకుల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు తెలిపారు. సమస్యలపై త్వరలోనే ఒక మేనిఫెస్టో రూపొందించి విడుదల చేస్తానని, ఓటరు నమోదు గడువు పెంపు నవంబర్ 23 నుండి డిసెంబర్ 9 వరకు పెరిగిన నేపథ్యంలో ఓటరు నమోదు చేసుకోలేకపోయినా పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేష్ యాదవ్, టిపిటిఎఫ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఆసిఫ్, లోనారే, కిరణ్, మహమ్మద్ హైమద్, అబ్దుల్ ఆహాబ్, పాల్గొన్నారు

## ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/ నెన్నెల :**ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆదర్శ రైతులు కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆదర్శ రైతుల సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయములో ఆదర్శ రైతులను నియమించారని అప్పటి ప్రభుత్వ పరిపాలనలో పది సంవత్సరాలు అటు రైతులకు ఇటు ప్రభుత్వానికి వారధిగా ఉండి చాలీచాలని గౌరవ వేతనం వెయ్యి రూపాయలకే పని చేస్తూ గ్రామాల్లోని ప్రతి రైతుకి సంక్షేమ పథకాలు అందే విధంగా పనిచేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ ఆదర్శ రైతు వ్యవస్థను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారనే నెపంతో తొలగించారని ఆరోపించారు.అనంతరం మండల ఆదర్శ రైతుల సంఘ కమిటీని ఎన్నుకున్నారు. ఆదర్శ రైతు సంఘం



మండల అధ్యక్షులుగా చేకుర్తి రాజిరెడ్డి (ఆవడం), ప్రధాన కార్యదర్శిగా గజేందర్ సింగ్ (గణపురం), గౌరవ అధ్యక్షులుగా సుంకరి శ్రీనివాస్ (నెన్నెల), ముఖ్య సలహాదారుగా దుర్గం శ్రీనివాస్ (ఆవడం), ఉపాధ్యక్షులుగా ఠాకూర్ అరుణ్ సింగ్ (నెన్నెల), కోశాధికారిగా పర్ష మల్లేష్ (జోగాపూర్), కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్వర్ గౌడ్ (చిత్తాపూర్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం..

**ప్రజాపక్షం/కుంటాల :** డిఎస్‌సిలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందిన వారిని మండలంలోని కల్లూరు గ్రామంలోని వీడిసి ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులు సృజన,విశాల,సాయికిరణ్,ప్రశాంత్,సంపత్,మహ్మద్ లను పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్యకు ఉన్నతమైన ప్రాధాన్యత ఇవ్వాలని,నాణ్యమైన విద్యను అందించేలా విద్యా వ్యవస్థను ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు.ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడం ఆనందదాయకం,సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్యాట్ల రజనికాంత్,రమణ గౌడ్,పసుల నవీన్,రజనికాంత్,గ్రమస్థులు పాల్గొన్నారు.



## పొలంలో అడవి పందుల స్వైరవిహారం



**ప్రజాపక్షం/ కాసిపేట :**అడవి పందులతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతూనే ఉంది. ఖరీఫ్ సీజన్ లో భూమిని సాగు చేసిన రైతులకు అడవి పందులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. విత్తనాలు మొలిచి పంట చేతికి వచ్చిన సమయంలో పొలంలో అడవి పందులు గుంపులుగా చేరి విహారం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం తాటిగూడ గ్రామంలో మడవి వెంకటేష్ అనే రైతు పొలంలో దాదాపు అర ఎకరం వరకు వరి పంటను అడవి పందులు గుంపులుగా చేరి వీర విహారం చేసి నాశనం చేశాయి. ఈ సందర్భంగా రైతు వెంకటేష్ మాట్లాడుతూ దీనిపై అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని, అడవి పందులను దూర ప్రాంతాలకు తరలించి, పందుల బెడద లేకుండా పంటలను కాపాడాలని అధికారులను వేడుకున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చిగురుమామిడి :**చిగురుమామిడి మండల ప రిధిలోని నవాబుపేట గ్రామంలో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. రూ. 1.15 లక్షల విలువైన చెక్కుల ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నరేందర్ సింగ్ ఠాగూర్, గ్రామశాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి షాబుద్దీన్, మీడియా కన్వీనర్ బోయిన వేణుగోపాల్, నాయకులు నాగరాజు, గొట్టె రఘుబాబు, వర్కోలు సంతోష్, శ్రీనివాస్, కొమురయ్య, నార్లపురం మల్లేశం, ఠాకూర్ దిలీప్ సింగ్, బోయిని వంశీకృష్ణ, కంది వేణు, మహంకాళి రవి, బోయిని వెంకటయ్య, పోచయ్య, జట్టి సాగర్, బూనాద్రి శ్రీను, నూనె సత్తయ్య, గూల్ల రాజయ్య, మల్లయ్య తదితరులున్నారు.

## కోడి పందాల నిర్వాహకుల అరెస్టు

**ప్రజాపక్షం/గొల్లపల్లి:**కోడి పందాలు ఆడుతున్న నిర్వాహకులను గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామ శివారులో కోళ్ల పందాలు ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గొల్లపల్లి ఎస్ఐ సిహెచ్ సతీష్, హెడ్ కానిస్టేబుల్ నర్సింగరావు, కానిస్టేబుల్ వేణు, హోంగార్డు జితేందర్‌తో కలిసి చందోళి గ్రామానికి వెళ్లి కోడిపందాలు ఆడుతున్న వ్యక్తులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు కోళ్లు, 6200రూ.లు నగదుస్వాధీనం చేసుకున్నారు. మరికొంతమంది వ్యక్తులు అక్కడినుండి తప్పించుకొని పారిపోయారని ఎస్ఐ చిర్ర సతీష్ తెలియజేశారు.

## పుడ ఏర్పాటు కోసం నేడు పెద్దపల్లి బంద్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:**రామగుండం అర్బన్ డెవలప్ మెంట్ స్థానంలో పెద్దపల్లి అర్బన్ డెవలప్ మెంట్(పుడ) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పుడ సాధన సమితి ఆద్వర్యంలో సోమవారం పెద్దపల్లి బంద్ కు పిలుపునిచ్చారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, దుకాణదారులు స్వచ్ఛందంగా పాల్గొని బంద్ విజయవంతం చేయాలని పుడ నాయకులు భూషణవేణి రమేష్ గౌడ్, బొంకూరి సురేందర్ సన్నీ కావేటి రాజగోపాల్, పల్లె సదానందం, తూముల శ్రీనివాస్, మంద భాస్కర్, బొడ్డుపల్లి రామ్మూర్తి, కల్లెపల్లి రవి, పర్ష సమ్మయ్య లు కోరారు. బంద్ సంపూర్ణంగా విజయవంతం చేసి పెద్దపల్లి ప్రజల అస్తిత్వం, ఆకాంక్ష తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి కుటుంబానికి అండగా గామ ఫౌండేషన్



**ప్రజాపక్షం/గంగాధర:**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో ఆహారభద్రతలో బాగంగా గామ ఫౌండేషన్ ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం జరిగింది. అందులో బాగంగా గ్రామస్తులు గామ ఫౌండేషన్ అందిస్తున్న నిత్యావసర సరుకులు పేద ప్రజలకు అందించడం ఆనందదాయకమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గామ ఫౌండేషన్ చొప్పదండి నియోజకవర్గ సెక్రటరీ పొత్తూరి సురేష్, ఉపాధ్యక్షుడు గజ్జెల సతీష్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ సైన్స్‌డే



**ప్రజాపక్షం/దండేపల్లి:** దండేపల్లి మం డ లం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ర ధానోపాధ్యాయులు బొలిశెట్టి బుచ్చన్న మాట్లాడుతూ సైన్స్ జీవితాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచి శాస్త్ర దృక్పతా న్ని పెంపొందించుకొని భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు పలువురిని ఆ కట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, అంగన్వాడీ టీచర్ లక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/బాన్సువాడ:**బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంప్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్టు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట్, కామారెడ్డి జిల్లాల్లోని 15 గురుకుల పాఠశాలలకు స ం బ ంధించిన1275 మంది క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో,వాలీబాల్,లాంగ్‌జంప్,హైజంప్‌క్రీడాపోటీలలోపాల్గొననున్నట్టుఆమెతెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:**నగరంలోని పద్మనగర్ కోటగల్లీలోని వివేకానంద విద్యాలయం ఉన్నత పాఠశాలలో 199798 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నగరంలోని ఎఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులంతా సమావేశమై ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబోధన చేసినా గురువులు, హాజరై తమ అమూల్యమైన సందేశాలను అందించారు. ఈ సందర్భంగా గురువులను పూలమాలలు, శాలువతో సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ప్రథమ స్థానం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్17 బాలికల ఖోఖో పోటీలలో జిల్లా జట్టు 3 పాయింట్ల తేడాతో నల్గొండ జట్టుపై విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జట్టుకు కోచ్‌లుగా సంతోషి, కల్పన, అశోక్ వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులకు కోచ్‌లకు అభినందనలు తెలిపారు.

## ఓటర్ నమోదు కార్యక్రమం

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం:** ప్రత్యేక ఓటర్‌నమోదు కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ గ్రామాలను ఎమ్మార్వో పరిశీలించారు. 2025 నాటిని 1 8 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటర్‌గా నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఎలాంటి తప్పులు ఉన్న సవరణల ద్వారా సరి చేయుట గురించి వివరించారు. ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

### జగిత్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో ఆదివారం రోజున సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జగిత్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ పరిశీలించారు. జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ధరూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలోడిపిఒ రఘువరణ్ పాల్గొని సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారా అని డిపిఒ పరిశీలించారు. సర్వే అయిన ప్రతి ఇంటి గోడపైన ఖచ్చితంగా స్టిక్కర్ అంటించాలని, పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగ్గా నింపుతున్నారా లేదా అని ఫామ్ ను తీసుకొని డిపిఒ పరిశీలించారు. ప్రతి ఇంటివారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓపికతో ప్రతి కుటుంబం నుండి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమాని వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని వారికి అర్థం అయ్యే విధంగా తెలియజేయాలని సూచించారు. నింపిన షెడ్యూల్ ఫారంలోని జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ డేటా ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ ఎంపిఒ వాసవి, ధరూర్ గ్రామ సెక్రటరీ అజయ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సభ్యసమాజాన్ని అధ్యయనం చేయాలి

### విస్డమ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కూర విజేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/జమ్మికుంట:**విధ్యార్థులు సభ్య సమాజాన్ని అధ్యయనం చేయాలని జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కూర విజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వినాయక గార్డెన్‌లో జూనియర్ కాలేజీ 20012003 విద్యాసంవత్సరం సిఈసి బ్యాచ్ పూర్వ విధ్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్లు దబ్బెట రవీందర్, బండి ప్రభాకర్, మల్లాడి మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ విధ్యార్థులు ఇప్పుడున్న సమాజంలో హైటెక్ టెక్నాలజీతో వెళ్తున్న విధ్యార్థులు అదే స్పీడుతో సమాజంలో ముందుకెళ్లాలన్నారు. అదే విధంగా అన్ని రంగాల్లో విధ్యార్థులు ఉండాలని, 22 సంవత్సరాల త్వరాత అందరూ కలుసుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన గురువులందరినీ ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మల్లిఖార్జున్, అవినాష్, వెంకటేశ్వర్లు, మొగిలి, రమేష్‌లతో పాటు విధ్యార్థులు నాంపల్లి రమేష్, సత్యనారాయణ రెడ్డి, సతీష్, సురేష్, కిషోర్, రంజిత్‌రెడ్డి, అశోక్, సురేందర్, స్రవంతి రెడ్డి, స్వప్న, సునీత, శోభలతో పాటు విధ్యార్థులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు మీదకు రాకుండా మార్కింగ్



**ప్రజాపక్షం / ధర్మపురి :** దైవ దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కింగ్‌ను ఏర్పాటు చేసారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎస్సై మహేష్‌ల ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయం నుండి నందీ కూడలి వరకు వర్తకుల దుకాణాల ముందు మార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. దేవాలయం సమీపంలో ఉన్న దుకాణం దారులు తమ తమ సామాగ్రిని రోడ్లపైకి పెట్టడంతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని అందుకే మార్కింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. మార్కింగ్ లోపల తమ సామాన్లు సర్దుకోవాలని సూచించారు. మార్కింగ్ బయటకు సామాన్లు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా దుకాణం దారులు ఏర్పాటు చేసుకున్న డేరాలతో సిసి కెమెరాలకు అంతరాయం ఏర్పడుతుందని వాటిని తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## లంబాడీల ఐక్యవేదిక కోఆర్డినేటర్‌గా కాట్రోత్ రవీందర్ నాయక్



**ప్రజాపక్షం/పిట్లం:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని బొగ్గులకుంట తాండాకు చెందిన కాట్రోత్ రవీంధర్‌నాయక్‌ను లంబాడీల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమిస్తూ నియామకపత్రాలు జారీ అయ్యాయి. ఈ స ందర్భంగా కాట్రోత్ రవీంధర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్‌కుమార్ జాదవ్‌కు, రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త రమేష్‌నాయక్ నాయకత్వాన్ని జాతి కొరకు, జాతి ప్రయోజనాల దృష్ట్యా బలపరుస్తూ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవిని కట్టబెట్టినందుకు గాను రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం మొత్తంలో ఆదివాసీ గిరిజన లంబాడీల సద్గురువు సేవాలాల్ మహారాజ్ కలలుగన్న గోరూర్‌గోర్‌వట్ కోసం పనిచేస్తామన్నారు. అందులో భాగంగా గోబ్యాక్ టు తాండ బాస్ పే బ్యాక్ టు ద సొసైటీ అనే నినాదంతో ముందుకు సాగుతూ తాండా దర్శన్ ప్రోగ్రాంలో తాండాలను వదిలి సాంస్కృతీకరించబడ్డ మేదావులు, చదువుకున్న వారు, ఉద్యోగులు, వారిని గోర్ ధరం వైపుప నడిపించి కేవలం తాండాలలో సప్త భవాని మాతలు అయిన క్యాంకళి యాడి, మ్యారామా యాడి, తోల్జ యాడీ, హింగ్లాజ్ యాడీ, సిత్లా యాడి, మంత్రాల్ యాడీ, ద్వాళ్ అంగల్ యాడీల భోగ్ బండార్ 6 గురు జాతి గురువుల అయిన రాజా భోజ్, దేమా గురువు తదితర గురువుల కార్యక్రమాలు నడిచే విధంగా చూసుకుంటామని తెలియజేశారు.

## అడిషనల్ డిఆర్‌ఎకు సన్మానం



**ప్రజాపక్షం/తలమడుగు:**మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన గంగన్న అడిషనల్ డిఆర్డిఏ గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ,గ్రామస్తులతో కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సంజీవ్ రెడ్డి,గోక ప్రకాష్ రెడ్డి,గాజుల సాంబశివ్,గోనెల పురుషోత్తం రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఎడపల్లి:**రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీ నారాయణ ఆదివారం పరామర్శించారు. గత 15రోజుల క్రితం బైక్‌పై నిజామాబాద్ నుంచి జాన్కంపేట్ వైపు వెళ్తున్న బీజేపీ జిల్లా నాయకుడు ఉప్పు సురేష్‌ను సారంగపూర్ కేడియా రైస్ మిల్ వద్ద గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌తో ఢీ కొట్టడం కిందపడి సురేష్ తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆయనను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీ నారాయణ ఆదివారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. వివరాలు తెలుసుకొన్న ఆయన ఘటనకు కారణమైన వారిని వెంటనే పట్టుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. న్యాయం జరిగే వరకు బాధితుని వెంట ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు న్యావనంది గోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సంజీవ్, సృజన్, హరిష్, రాము, మురళి, సాయిలు, సంగారెడ్డి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న స్వామిని దర్శించుకున్న అఘోరి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామంలో కొండపై కొలువైన కోరమీశాల వెంకన్న స్వామి భక్తులకు కొంగు బంగారం విలసిల్లే ప్రజల కోరికలను తీర్చే ఇంటి ఇలవేల్పుగా భక్తులు నిత్యం కొలచే స్వామివారిని ఆదివారం అఘోరి ఆకస్మాత్తుగా ప్రత్యక్షమై శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అఘోరి మాట్లాడుతూ కాశీ నుంచి బయలుదేరి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో పూజలో పాల్గొని లోక కళ్యాణార్థం కొరకు యాత్ర చేపట్టినట్లు అఘోరి తెలిపారు. అఘోరిని చూడడానికి గ్రామంలోని పలువురు ఆలయ ప్రాంగణానికి చేరుకుని దర్శించుకున్నారు.

## నూతన ఐటిఐ కాలేజీ నిర్మాణం కోసం శంకుస్థాపన

**ప్రజాపక్షం/ నస్పూర్:**నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి కాలనీ లో నూతన ఐటిఐ కాలేజ్ నిర్మాణం కోసం ఆదివారం భూమి పూజ చేసిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ , మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐటిఐ లోని కోర్సులకు అధిక డిమాండ్ ఉందని, నైపుణ్యం గల విద్యార్థులకు ఎలాంటి పైరవి లేకుండా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురమిళ్ల వేణు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు తాళ్ల సంపత్ రెడ్డి,కురిమిళ్ల మహేష్, దారవేణి తిరుపతి కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ అందుకున్న విద్యార్థులు



**ప్రజాపక్షం/నస్పూర్ :** హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో శ్రీ రాజరాజేశ్వర భారత కళాసేవ సమితి కార్తీక మాస సంగీత నృత్య మహోత్సవం కార్యక్రమంలో సిసిసి న స్పూర్ కు చెందిన శ్రీనిధి నృ త్యాలయం చిన్నారులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి క ళాకారిణి రాధా మోహన్ చేతుల మీదగా తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృ త్య గురువు వసుధ మాట్లాడుతూ రానున్న రో జుల్లో శ్రీనిధి నృత్యాలయం కూచిపూడి నృత్య అకాడమీ వివిధ ప్రా ంతాలలో ఏర్పాటు చేసి అనేక మంది కళాకారులను తయారు చేస్తానని తెలియజేశారు.

# రైతులకు శాపం.. ధాన్యం దళారుల పాలు

**కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో అధికారుల నిర్లక్ష్యం**

**రైతులకు అందని మద్దతు ధర...**

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి**



**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని రైతులకు సంబంధించిన వరి పంట పొలాల కోతలు ఇప్పటికే 30% పైగా పూర్తికాగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందుదాం అనుకునే రైతులకు అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో అప్పటికే అకాల వర్షాల భయానికి, ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేని కారణంతో చేసేదేమీ లేక రైతులు పండించిన సన్న వరి ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవడం జరిగిందని దీనికి కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడమే కారణమని కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉండగా అధికారుల, అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతోనే 30% మంది రైతులు ఇప్పటికే కష్టించి పండించిన వరి ధాన్యం దళారులకు అమ్ముకొని మద్దతు ధర లేక నష్టపోవడం జరిగిందని కిషన్ రెడ్డి అన్నారు.కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతోనే రైతులు దళారుల బారిన పడాల్సి వచ్చింది అన్నారు. దళారుల బారిన పడ్డ ప్రతి రైతు ధాన్యానికి క్వింటాల్ 500 రూపాయల బోనస్ ఇప్పించే విధంగా చూడాలని కిషన్ రెడ్డి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం /రామగిరి :** రెండు దశాబ్దాల క్రితం రొంపికుంట శ్రీవివేకానంద హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ, సమ్మేళన వేడుకను ఆదివారం ఘనంగానిర్వహించుకున్నారు.2003–2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా గ్రామంలోని పాఠశాలలో కలుసుకుని ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను మళ్లీ గుర్తు చేసుకుని ఆనందపడ్డారు. స్నేహితులు తమ కష్ట సుఖాలను పంచుకున్నారు. ఆటపాటలతో రోజంతా సంతోషంగా గడిపారు. చిన్నప్పుడు ఆ విద్య నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు రాజయ్యరూ, 10 వేలు, అన్వర్ పాషాలకు రూ. 10 వేల చొప్పున అందజేశారు. అలాగే తమ తోటి మిత్రుడు రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా, అతని పిల్లలకు రూ. 10వేల ఆర్థిక సాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఐపిఎస్ విద్యార్థులు




**ప్రజాపక్షం/సుల్తానాబాద్:**ఈ నెల 5న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎస్ జి ఎఫ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన 17 సంవత్సరాల బాలబాలికల రగ్బీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు శివ ప్రసాద్, శ్రీకర్, బ్లేస్సి, అన్విత లు ఈ నెల 10, 11,12 వ తేదీలలో మేడ్చల్ లో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలియజేశారు.చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించి రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ పాల్గొన్నారు.

## హర్యానా గవర్నర్‌ను సన్మానించిన బిజెపి శ్రేణులు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకుడు డాక్టర్ హెగ్డేవార్ పూర్వికుల స్థలంలో నిర్మిస్తున్న డాక్టర్ కేశరాం, బలిరాం హెగ్డేవార్ స్ఫూర్తి కేంద్రం పనులను హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ పరిశీలించారు. అనంతరం ఆయన కందకుర్తి గ్రామంలోని త్రివేణి సంగమం వద్ద గంగా హారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ విచ్చేశారు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి కందకుర్తి వెళ్తున్న దత్తాత్రేయను ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో నిలిపారు. ఈ మేరకు బీజేపీ శ్రేణులు గవర్నర్ బండారు దత్తాత్రేయ ను శాలువాలతో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీ నారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్, బీజేపీ నాయకులు న్యావనంది గోపాల్, మాజీ ఎంపీటీసీ మంద సంజీవ్, హరిష్, సృజన్, రాము, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రబీ పంటకు సిద్ధమవుతున్న రైతన్న



**ప్రజాపక్షం / నందిపేట్ :**నందిపేట్ డొంకేశ్వర్ మండలాలలో రైతులు రెండవ పంట ఈ శీతాకాలంలో (రబీ) వేయడానికి సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో వేసిన వరి పంటలు మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో కోతలు ముగుస్తాయి. ఈసారి చెరువులు నిండు కండలా నీళ్ళు ఉన్నాయి. అంతేకాకుండా శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులలో నీళ్ళు సమృద్ధిగా ఉన్నాయి. అందుకే చాలా మంది రైతులు స్వల్పకాలిక వరి వంగడాల వైపు మొగ్గుచూపుతున్నారు. మరికొందరు ప్రభుత్వం ఎంపిక చేసిన సన్నరకాలు వేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఖరీఫ్‌లో వరి పంటకు బోనస్‌గా క్వింటాలుకు రూ. 500 ఇస్తామని చెప్పడంతో రైతులు సన్నాలవైపు మొగ్గుచూపారు. కానీ ఇంతవరకు బోనస్ డబ్బులు పడలేదు. కొనుగోలు కేంద్రాలలో అమ్ముకున్న రైతులకు ఇంకా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమకాలేవు. బోనస్ డబ్బులు వేరుగా ఇస్తారని అనుకుంటున్నా రైతులకు నమ్మకం లేదు. అందుకే రబీలోస్వల్పకాలిక సన్నరకాలను ఎంచుకొని నారు పోయడానికి సిద్ధం అవుతున్నారు. కోత మిషన్ కోత కోయగా పనికిరాని గడ్డికి నిప్పు పెడుతున్నారు. పంట పొలాలను దున్నుకుంటూ చదునుచేస్తున్నారు. కొందరురైతులు నారుమళ్లకు నీరుపెట్టి కలుపు మొక్కలు రాకుండా చూసుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో మెట్ట పంటలు సోయ, మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పువ్వు వేయడానికి పంట పొలాలను దున్ని బోయ కొట్టుకుంటున్నారు. మరికొందరు ఉన్న కొద్దిపాటి భూములలో కూరగాయలు, పప్పు దినుసులు వేయడానికి సిద్ధం అవుతున్నారు. నాణ్యమైన విత్తనాలకు ఎదురుచూస్తున్నారు. ఈ రబీలో సుమారు 24 వేల ఎకరాలలో పంట, మరో నాలుగు వేల ఎకరాలలో మెట్ట పంటలు పండించడానికి సిద్ధం అవుతున్నారు.

**వ్యవసాయ అధికారిణి వివరణ...**

నందిపేట్ ఉమ్మడి మండలాల్లో వరి కోతలు వారం రోజుల్లో ముగుస్తాయని, రబీ పంటలకు రైతులు సిద్ధమవుతున్నారని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న భవాని వివరించారు. స్వల్ప కాలిక వరి వంగడాలు అన్ని సహకార సంఘాలకు వస్తాయని చెప్పారు.

## కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి

కుటుంబ సభ్యులను ఓదార్చిన

బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:**రాజన్న సిరిసిల్లజిల్లా కేంద్రంలో శనివారం అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న బైరి అమర్ స్రవంతి పవర్‌లూం కార్మిక దంపతుల కుటుంబ సభ్యులను సిరిసిల్ల బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి బిఆర్ఎస్ నాయకులతో కలిసి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చి పార్థీవ దేహాలకు నివాళి అర్పించారు. బిఆర్ఎస్ పట్టణ శాఖ తరుపున నేత కార్మిక దంపతుల దహన సంస్కారాలకు 20వేల రూ.లు జిందం చక్రపాణి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పవర్‌లూం కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వం నైతిక బాద్యత వహించాలని అన్నారు. ఈ ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమని ఎద్దేవా చేశారు. వీరి వెంట కౌన్సిలర్ సభ్యులు అన్నారం శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, ఆర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపల్లి లక్ష్మి నారాయణ, మాజీ కౌన్సిల్ సభ్యులు మ్యాన రవి, గుండ్లపల్లి పూర్ణ చందర్, సందీప్, శ్రీనివాస్, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యంలో మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల సంతోష్ రచన ఎంగేజ్మెంట్ వేడుకలు ఆదివారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ముఖ్య అతిథులుగా పాల్గొని వారిని ఆశీర్వదించారు. వారి వెంట మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య తోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ -2 పరీక్ష

**ప్రజాపక్షం/రామగిరి:**తెలంగాణ రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్ 2పరీక్ష ఆదివారం మంథని జేఎన్టీయూ హెచ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 150 మంది అభ్యర్థులగాను 147 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హజర్ అయినట్లు ప్రిన్సిపల్ చెరుకు శ్రీధర్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించిన అనంతరమే పరీక్షా కేంద్రంలోని పంపించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రామగిరి ఎస్సై పెట్టం. చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## నృసింహుడి సన్నిధిలో ఎఎస్‌పి పూజలు



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహ స్వామి సన్నిధిలో ఆదివారం వేములవాడ అసిస్టెంట్ ఆఫ్ సూపరింటెండెంట్ పోలీస్ శేషాద్రిని రెడ్డి స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం ఆధ్వర్యంలో సాంప్రదాయంగా సాధారణ రీతుల్లో స్వాగతం పలికారు. సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సమగ్ర కులగణన సర్వే చేపట్టిన అధికారులు



**ప్రజాపక్షం/బాన్సువాడ:**బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో ఆదివారం సమగ్ర కుల గణన సర్వేలో భాగంగా ఎంపివో సత్య నారాయణ రెడ్డి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సర్వే చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్, చాంద్, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్క భూమాతకు రక్ష

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట ప్రాంతంలో నెహ్రూ యువ కేంద్రం జగిత్యాల ఆధ్వర్యంలో ఆదివారం ఏక్ పేడ్ మా కే నామ్ ( అమ్మ పేరు మీద ఒక మొక్క) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి మండల అధ్యక్షులు కట్ట మహేష్ పాల్గొని రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ పేరు మీద మొక్కలు నాటడం చాలా సంతోషకరమని అమ్మ మనల్ని జీవితాంతం ఎలా రక్షిస్తుందో అలాగే ఒక చెట్టు కూడా మనల్ని మన పర్యావరణాన్ని కాపాడుతుందని అన్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం ఏదంటే పర్యవరణమేనని అన్నారు. పేద, ధనిక అనేక తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ తల్లి కోసం మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు మహేష్, హరీష్, సంతోష్, అరవింద్, సన్నీ, నితిన్, ఇర్ఫాన్, రాకేష్, సోను,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య పేరిట దోచుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థ



**ప్రజాపక్షం/ రామగిరి :** సింగరేణి కంపెనీ సౌజన్యంతో RGIII ఏరియాలోనీ సెంటనరీ కాలనీలో ప్రైవేట్ విద్యాసంస్థ సింగరేణి కార్మికుల పిల్లలను, ప్రభావిత గ్రామాల పిల్లలను విద్య పేరిట అధిక ఫీజుల తోదోచుకుంటుందని సింగరేణి ఆధ్వర్యంలో నడిచే ఈ విద్యాసంస్థపై సింగరేణి సిఎన్ఎండి డైరెక్టర్( పా) బలరాం నాయక్, పట్టించుకోవడంలేదని దీంతో కార్మికులు ,ప్రభావిత గ్రామ ప్రజలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఈ విద్యా సంస్థపై చర్యలు తీసుకొని లీజును రద్దు చేయాలని బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్మూరి శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశాడు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సింగరేణి సంస్థభవన నిర్మాణంతో సహా 21 గదులు ఉన్న స్కూలు ప్రవేట్ విద్యా సంస్థ యజమాన్యానికి లీజుకు ఇచ్చిందనీ కార్మికుల పిల్లల తల్లిదండ్రుల దగ్గర మరియు ప్రభావిత గ్రామాల పిల్లల తల్లిదండ్రుల దగ్గర తక్కువ ఫీజులు తీసుకోవాలని మరియు విద్యా హక్కు చట్ట ప్రకారం SC,ST,BC లకు ఫీజులో రాయితీలు ఇస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలనీ 20 సంవత్సరాల క్రితం ఈ యొక్క నిబంధనలతో సింగరేణి యాజమాన్యం ప్రైవేటు సంస్థ అయినా వాణి విద్యాసంస్థకు లీజుకు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ప్రైవేటు విద్యాసంస్థ కేవలం విద్యా వ్యాపార ధోరణితో అత్యధిక ఫీజులు సింగరేణి కార్మికుల పిల్లల దగ్గర వసూలు చేస్తున్న కూడా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదనీ ఈ ప్రైవేటు యాజమాన్యం నాణ్యమైన విద్యను అందించడం లేదనీ పిల్లల నైపుణ్యం కోసం ఆటల పోటీలు, క్రీడలు నిర్వహించడం లేదనీ, మహిళా విద్యార్థులకు బాత్రూంలు కూడా సరిపడా లేవనీ, ప్రహరీ గోడ లేక పశువులకు, పందులకు అడ్డాగా మారిందనీ ప్రైవేట్ విద్యాసంస్థ తన అధికార అండబలంతో అధికారులను భయపెట్టి తాను ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు, సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదనీ ఇప్పటికైనా సింగరేణి అధికారులు కార్మికుల పిల్లల బంగారు భవిష్యత్తు గురించి ఆలోచన చేసి ఈ యొక్క స్కూల్ ను ప్రైవేటు విద్యాసంస్థల నుంచి సింగరేణి కంపెనీ తీసుకొని స్వయంగా వాళ్లే CBSE సిలబస్ ఏర్పాటు చేయాలని బిజెపి పక్షాన డిమాండ్ చేయడం జరుగుతుందని , వెంటనే ఫీజుల నియంత్రణ, మరియు పాఠశాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో సింగరేణి RGIII జిఎం ఆఫీసును కార్మికుల పిల్లల కుటుంబాల తో కలిసి ముట్టడి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్, సీనియర్ నాయకులు మెరుగు శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే రాక..

**ప్రజాపక్షం/ముధోల్ :** మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు నేడు (సోమవారం)ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రానున్నారని స్థానిక బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.జూనియర్ కాలేజీ,విద్యార్థినుల కొరకు ఏర్పాటు చేసిన నూతన భవనాన్నిద ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమానికి మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు రావాలని మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, మండల నాయకులు తాటి వార్ రమేష్, జీవన్, దేవోజీ భూమేష్, మోహన్ యాదవ్ తదితరులు కోరారు.

## ప్రారంభం కానున్న జోనల్ క్రీడోత్సవాలు..

**ప్రజాపక్షం/ముధోల్ :** మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో 10వ జోనల్ క్రీడోత్సవాలు నేటి నుండే ప్రారంభం కానున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా నర్సింహారెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.జోనల్ పరిధిలోని ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాల అండర్ 14, 17,19 విభాగాల్లోని బాలుర కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్, చెస్, క్యారం, అత్లేటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు నిర్వహించేందుకు సిద్ధం చేశామన్నారు

## భూములు కోల్పోయిన రైతులకు నిధులు జమ చేయాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** నేషనల్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నిధులు వెంటనే తమ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని భూములు కోల్పోతున్న రైతులు అన్నారు.ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన కలవేనా ప్రకాష్,రాజ్ కుమార్, ఎర్రం సమ్మయ్య తో పాటు తదితరులు తమ గోడును విలేకరుల సమావేశంలో చెప్పుకున్నారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే కింద భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ తమకు రావలసిన నష్టపరిహారం సంబంధించిన డబ్బులు నేటి వరకు కూడా రాలేదని రైతులు తెలిపారు. తాము 45 రోజుల నుండి అధికారుల చుట్టూ తిరిగి చివరికి కలెక్టర్ ఫిర్యాదు చేసిన నేటి వరకు కూడా తమకు రావలసిన నష్టపరిహారం సంబంధించిన డబ్బులు నేటి వరకు కూడా బ్యాంకు ఖాతాలో జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం ఇవ్వకుండానే తమ పట్ట భూమిని ఆన్లైన్ నుండి తొలగించారని రైతులు తెలిపారు. అధికారులు మాత్రం డబ్బులు బ్యాంకులో జమ అయినట్టు రెవెన్యూ అధికారుల నుండి పత్రాలు ఇచ్చారని బ్యాంకుకు వెళ్లి డబ్బులు చూస్తే మాత్రం ఖాతాలో డబ్బులు జమ కాలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా తమకు రావలసిన నష్టపరిహారం సంబంధించిన డబ్బులు వెంటనే తమ ఖాతాలో జమ చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

## ఓపెన్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం




**ప్రజాపక్షం/నేరడిగొండ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సాంఘిక సమాజ, ఆర్థిక, చరిత్ర, రాజకీయ, జర్నలిజం,మొదలగు సోషల్ సైన్సెస్ శాస్త్రాల శాఖల సమన్వయంతో సార్వత్రిక సామాజిక వేదికను ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ కే.కృష్ణారెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నేరడిగొండ మండలంలోని లక్కంపూర్,చించోలి,ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్, గ్రామాలలోని యువతకు ఉన్నత విద్య పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికి ఉన్నత విద్య అందుబాటులో ఉండే విధంగా గత నాలుగు దశాబ్దాలుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రతి గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అతి తక్కువ ఖర్చుతో అందిస్తుందని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నవంబర్ 15లోపు అడ్మిషన్ పొందాలని ప్రతి విభాగానికి అర్హత ఉన్న విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యాదగిరి కంభంపాటి,పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బూజు శ్రీనివాస్,డాక్టర్ పి.లక్ష్మణ్, బి.రాజు గౌడ్, పి.రజనీకాంత్, గ్రామాలలోని యువత తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాలను పెంచాలి



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒరిగిందేమీ లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఊగిలె సుధాకర్ పటేల్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతులను దగా చేస్తోందని మండిపడ్డారు. అప్పుచేసి ఎంతో కష్టపడి పంటను పండించిన రైతులు ఐకేపి కేంద్రాల ద్వారా విక్రయ కేంద్రాలకు తీసుకువస్తే ప్రభుత్వం జాప్యం చేయడమే కాకుండా అధికారుల కొరత చూపించి తూతూమంత్రంగా కొనుగోలు చేస్తోందన్నారు. తరుగు రెండు కిలోల వరకు తీస్తూ మద్దతు ధరను కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మద్దతు ధరను రూ.2500లకు పెంచి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని, ఐకేపి కేంద్రాలను పెంచాలని డిమాండ్ చేశారు. దళారులు లేకుండా అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరితగతిన వడ్లను కొనుగోలు చేసి జిల్లాలోని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కాంగ్రెస్కు, గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. రెండు పార్టీలు దొందు దొందేగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వడ్లు కొనుగోలు చేసి మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు.

## మందుల కొరతను తీర్చాలి..



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని పల్లె దావఖానాలలో మందుల కొరత తీవ్రంగా ఉందని రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదని లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ ఆరోపించారు.పల్లె ప్రాంతాల్లోని గిరజనలు ఆదివాసుల కోసం ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె దావఖానాలో ఉట్టి బిల్డింగులు తప్ప ఎటువంటి సదుపాయాలు అందడం లేదని వచ్చిన రోగులకు సరిపడా మందులు లేక నాన అవస్థలు పడుతున్నారని అన్నారు.మండలం కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన అక్కడ కూడా మందుల కొరత ల్యాబ్లో కెమికల్స్ లేక రోగనిర్ధారణ పరీక్షలు జరగడంలేదని జరిగిన సకాలంలో అందించడం లేదని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత లేకుండా చూడాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు.

## సమగ్రసర్వేలో ఒడిదుడుకులు..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** అందరి కుటుంబ సభ్యుల వివరాల స్టిక్కర్లు అంటించలేదని ఎల్లారెడ్డిపేట మండలంలో కుటుంబ సమగ్ర సర్వేలో ఇమ్యున్యూయేటర్లకు సమస్యలు ఎదురయ్యాయి. ఆదివారం సైతం ఆన్డ్యూటి చేశారు.కొంతమంది ఇళ్ళలో రెండు, అంతకంటే మించి ఫ్యామిలీలు ఉండటంతో ఒకయజమాని వివరాలే సేకరిస్తున్నారని మండల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల అధికారుల ఆదేశాల ప్రకారం ఉదయం పూటనే సర్వేను ఆరంభించారు. ప్రతి ఒక్కరు సహకరించాలని రెవిన్యూ అధికారులు తెలిపారు.ప్రజాపక్షం ప్రతినిధి ఇమ్మాన్యుయేటర్ను సర్వేపై ఎమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని అడగగా కొంత మంది ఇళ్ళకు యాజమానుల స్టిక్కర్లను అంటించిన వివరాలను సర్వే చేస్తున్నామని లేని వారు గ్రామపంచాయితీ సెక్రటరిని అడిగి స్టిక్కర్లను అతికించుకుంటే మళ్ళీ సర్వేలో భాగంగా తప్పకుండా నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు.కొన్ని చోట్ల ఓడిదుడుకులు సంభవిస్తున్న విషయం ఇమ్మాన్యుయేటర్ మిట్టపల్లి ప్రశాంత్కుమార్ మీడియాతో అన్నారు.

## రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో గత మూడు రోజులుగా జరుగుతున్న అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు సత్తా చాటింది. మూడు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో హౌరా అనిపించింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో వరంగల్ జట్టుపై అదిలాబాద్ జట్టు గెలిచి టోర్నమెంట్ ఛాంపియన్ షిప్గా నిలిచి క్రీడా పథకాన్ని ఎగరవేసి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.జట్టుకు కోచ్ లుగా వ్యవహరించిన అరవింద్, సాయి, స్ఫూర్తి, వివేక్ తో పాటు క్రీడాకారులను అసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్ జి ఎఫ్ కార్యదర్శులు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనే శ్యాంసుందర్ రావు, కనపర్తి రమేష్, జిల్లా ఒలంపిక్ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, గిరిజన శాఖ డిడి రమాదేవి, గిరిజన స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు, కోచ్ లు, పిడిలు అభినందించారు.

## మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఇందూరు యువత మనశాంతి కోవెల ఆశ్రమ నిర్మాణానికి త్వరలో సహకారమందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్అలీ అన్నారు. ఆదివారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్అలీ సందర్శించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమ ప్రభుత్వం తోడుగా నిలుస్తుందని 13 ఏళ్లుగా నిర్విరామంగా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు తమ సంస్థ నిర్వహించే కార్యక్రమాలను సభకు వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## వృద్ధుని మృతి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు యాదవ నగర్కు చెంది న తొట్ల మధురయ్య (70) అనే వృద్ధుడు మృతి వాత పడ్డాడు.. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం తొట్ల మధురయ్య, కొడుకు తోట్ల తిరుపతి ల మధ్య వాగ్వివాదం జరగడంతో సంఘటన జరిగినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి యాదవ్ నగర్ లో గల నివాసాన్ని పరిశీలించి గొడవకు గల కారణాలను బం ధువులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చే స్తామని తెలిపారు.

## మాజీ సర్పంచుకు పరామర్శ



ప్రజాపక్షం/నిజాంసాగర్‌: నిజాంసాగర్ మండలకేంద్రానికి చెందిన మాజీ సర్పంచు, భరాస పార్టీ సీనియర్ నాయకుడు బేగరి రాజు గత 4 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే,మాజీ అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హన్మంతిషిండే ఆదివారం బేగరి రాజు నివాసానికి వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరాతీసి, వైద్యుల సలహాలు, సూచనలు పాటించి త్వరగా కోలుకోవాలని సూచించారు.మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు లింగాగౌడ్‌కు సైతం తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయన ఆరోగ్యం గురించి ఆరాతీశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు దుర్గారెడ్డి, అచ్చంపేట్ విండో చైర్మెన్ నర్సింహారెడ్డి, నాయకులు గైని విఠల్, రమేష్‌గౌడ్, యాటకారి నారాయణ, రమేష్, విజయ్, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, నిజాంసాగర్ నాయకులు ఉన్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : స్వాతంత్ర సమరయోధులు మత,సమైక్యవాధి,దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి ఉత్సవాలను కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక క్లాక్ టావర్ ముందర మౌలానా ఆజాద్ చౌక్ లో నిర్వహిస్తున్నట్లు ఆ సోసైటి వ్యవసాపక, అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ తెలిపారు. ఈ నెల 11న సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిచే ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు,ప్రముఖులు,విద్యావేత్తలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## ఎఎస్ఐకు సన్మానం

ప్రజాపక్షం /రామగిరి : రామగిరి పోలీస్ స్టేషన్ లో నూతనంగా ఏఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన ఈదునూరి స్వామిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు మరియు సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏఎస్ఐ స్వామిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల కేంద్ర కమిటీ సభ్యులు ఇరుగురాల శ్రీనివాస్, ఆర్ జి శ్రీ ఏరియా ఉపాధ్యక్షుడు బత్తుల శంకర్ ఏఎస్ఐ స్వామికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సన్మాన కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు బద్దిపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తోగరి చంద్రయ్య, అడ్డూరి ప్రవీణ్ కుమార్, దుబాసి రంగయ్య, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణపై సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం సరైంది కాదు





ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ఎస్సీ వర్గీకరణపై సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం సరైంది కాదని చెప్పినానని చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ అన్నారు. స్వజాతి ప్రయోజనాల కోసం కంకణం కట్టుకున్న మాలల ఎదుగుదలను అణిచివేసే కుట్రలను ఎదుర్కోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం నగరంలో జరిగిన మాలల ఆత్మగౌరవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ సంచల వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ వర్గీకరణపై సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం సరైంది కాదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చాక మాల జాతిలో అభద్రత నెలకొందని ఇప్పుడు మేల్కొపోతే మాలజాతి భవిష్యత్తు అగాధంలో పడుతుందని, స్వంత పనులు పక్కన పెట్టాల్సిన టైం వచ్చిందన్నారు. భయం ముసుకు వీడి ధైర్యం చూపాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు మన సత్తా అర్థమయ్యేలా ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో మాల కమ్యూనిటీది రెండవ స్థానం 30 లక్షల మంది జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారు. ఐక్యతను చీల్చటానికి కుట్రలు జరుగుతున్నాయని, ఐక్యత సాధించటానికి మా నాన్న స్ఫూర్తితో బయటకు వచ్చానని గుర్తు చేశారు. ఈడీ, ఇన్‌కామ్ ట్యాక్స్ రెయిడ్లతో భయపెట్టడానికి ప్రయత్నించారు. ఉద్యమం నుంచి బయటకు వస్తే కేంద్రంలో మంత్రి పదవి ఇస్తామని చెప్పిన దేనికి లొంగలేదని స్వరాష్ట్రాన్ని సాధించానని గుర్తు చేశారు. సిఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు నా ఫ్యాక్టరీ క్లోజ్ చేయించారు. నా మీద ఎప్పటికీ ఎలాంటి ప్రెజర్స్ పని చేయలేవని, మా నాన్న కాక వెంకటస్వామి బోధనలతో పెరిగిన వాడినని నష్టాలు, కష్టాలు వచ్చినా పట్టించుకునే వాడిని కాదని, ఏసీబీ దాడులు 90 శాతం మాల ఉద్యోగులపైనే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య, నాయకులు అలుక కిషన్, ఎల్ల నాగరాజు, అమృత్, విజయ్, రాంచందర్, అంగరి ప్రదీప్, ఎల్లమయ్య, స్వామిదాస్, దేవిదాస్, మోహన్ రావు, సంజీవయ్య, సుభాష్, నర్సయ్య, విజయ్‌కుమార్, జైపాల్, మోహన్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి మార్నింగ్ వాక్



ప్రజాపక్షం/నెన్నెల : గ్రామాల్లోని సమస్యలను బెల్లంపల్లి ఎంఎల్ఎ గడ్డం వినోద్ వెంకటస్వామి దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్ళడమే లక్ష్యంగా ఎంఎల్ఎ ఆదేశాలతో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల మండలంలో కాంగ్రెస్ నాయకులు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని చర్చ్ వాడలో కరెంట్ పోల్ సపోర్ట్ వైర్ పవర్ ఎర్త్,చింత వాడలో హ్యాండ్ బోర్, మిషన్ భగీరథ వాటర్, 11కేవీ కరెంట్, కర్జీ జంగల్ పేట్, కొత్తగూడెం గ్రామాలలోని పంట పొలాలకి వెళ్ళే మట్టి రోడ్డు, త్రాగునీరు సమస్య, మినరల్ వాటర్ ప్లాంట్, కొత్తగూడెం మానేపల్లి మధునయ్య ఇంటి వద్ద హ్యాండ్ బోర్ సమస్య, కర్జీ గ్రామం నుండి ప్రైమరీ స్కూల్ రోడ్డు, పోడు భూముల సమస్యల గురించి ప్రజలు వివరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, గొల్లపల్లి మాజీ ఎంపిటిసి బొమ్మెన హరీష్ గౌడ్ మాట్లాడుతూ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం ఎంఎల్ఎ తనయురాలు వర్షా మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలు సేవలు పొందాలని, కంటి సమస్యలు ఉన్న వృద్ధులు, పెద్దలు, యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కర్జీ జంగల్ పేట్ మాజీ ఎంపిటిసిలు శిరీష, మదునయ్య, సాయి, గౌతం, సంజయ్, రాజు, రవి, దిలీప్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు ఇవ్వకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చావుడప్పే



ప్రజాపక్షం/జమ్మికుంట: హుజురాబాద్ అంబేద్కర్ విగ్రహానికి దళితబంధు లబ్ధిదారులు వినతి పత్రం ఇచ్చి ధర్నాకు దిగిన దళితనాయకులు, లబ్ధిదారులను పోలీసులు విచక్షణ రహితంగా లాఠీచార్జి చేసి దాడి చేయడాన్ని దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి దళితబందు కుటుంబానికి 12 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకుంటామని మభ్యపలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో దళితులను ఆర్థికాభివృద్ధి చేయడం కోసం గత ప్రభుత్వం పైలెట ప్రాజెక్టు సుమారు 18 వేల దళిత కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల రూపాయలను మంజూరు చేయగా మొదటి విడతగా రూ.5 లక్షల రూపాయలు విడుదల చేసి వివిధ రకాల వ్యాపారాలు పెట్టుకుని జీవిస్తున్న తరుణంలో రెండో విడత ఐదు లక్షల రూపాయలను సుమారు 5500 మంది లబ్ధిదారుల అకౌంట్లను ఫ్రీజ్ చేయడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే 12 లక్షల రూపాయలు వద్దని, నియోజకవర్గంలో రెండో విడత రాని లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు ఫ్రీజ్‌ను తొలగించి వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అరెస్టులు, గృ హనిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఫ్రీజ్‌లో ఉన్న దళితబంధు పథకాన్ని వెంటనే విడుదల చేయకుండా నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘ నాయకులు రాజకీయ పార్టీల నాయకుల ఊబిలో పడకుండా దళితబంధు లబ్ధిదారులను ఏకం చేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రశంసా పత్రం




ప్రజాపక్షం /సుల్తానాబాద్ : సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఇంటర్నేషనల్ ప్రజెంట్ ప్రెసిడెంట్ ప్రశంస పత్రం లభించింది. ఆదివారం సుల్తానాబాద్ మండల పరిధిలోని నరసయ్యపల్లి లోని ఫోటోఫామ్ లో ఆదివారం లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ మిషన్ 1.5 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా 15 లక్షల మంది లయన్స్ క్లబ్ సభ్యుల సభ్యత్వ నమోదు చేరుకోవడమే లక్ష్యంగా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను చేర్పించి సభ్యత్వ నమోదుకు కృషి చేసినందుకుగాను అభినందనలు తెలియజేస్తూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అభిషియేషన్ సర్టిఫికెట్లను ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబు రావు,జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్ జిల్లా కోఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్ లకు అందజేశారు.

## కుటుంబ సర్వేను పరిశీలించిన తహసీల్దార్



ప్రజాపక్షం/గొల్లపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల వ్యాప్తంగా జరుగుతున్న కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ను తహశీల్దార్ వరదన్ ఆదివారం రోజున పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ప్రతి ఇంటికి అతికిస్తున్న స్టిక్కర్లను ఇంటి యజమానులను సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో ప్రతి ఇంటిని సక్రమంగా ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు బాధ్యతగా సర్వే చేయాలని ఆయన తెలిపారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని విడిచిపెట్టవద్దని, అన్ని కుటుంబాలను సమగ్ర వివరాలు సేకరణ చేయాలని ఎన్యుమరేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణనలో కుమ్మరులు కుమ్మర అని నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/పిట్లం: కుమ్మరులు కుమ్మర అని కుల గణనలో నమోదు చేసుకోవలాని తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా కుల గణన నమోదు కార్యక్రమంలో కుమ్మరులు కుమ్మర అని నమోదు చేసుకోవాలని కామారెడ్డి జిల్లా కుమ్మర సంఘం ఉపాధ్యక్షులు కుమ్మరి యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో కుమ్మరులు చాలా మంది కుమ్మరులు అని చెప్పకుండా శాలివాహన, మరికొందరు ప్రజాపతి అని మరికొందరు బీసీబి అని చెప్పారు. ఇలా నమోదు చేయడం వలన గతంలో చేసిన సమగ్ర కుటుంబ జనగణన సర్వేలో కుమ్మరులు 3.85 లక్షల మంది ఉన్నారని, కాని అది సర్వేలో తప్పుగా ఉందని 13 లక్షల మంది కుమ్మరులు తెలంగాణ వ్యాప్తంగా ఉన్నారని కుమ్మరిసంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి యాదగిరి కోరారు.

## సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జెఎసి, యాజమాన్యానికి జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022 సెప్టెంబర్‌లో యూనియన్ నాయకులకు, సింగరేణి యాజమాన్యానికి ఒప్పందం జరిగిందని, ఈ ఒప్పందం ప్రకారం బెల్టు క్లీనింగ్, షాలే పికింగ్, బ్లాస్టింగ్ వర్క్ షాప్ లలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు సెమి స్కిల్డ్ వేతనాలు అదేవిధంగా కన్వేయర్స్ డ్రైవర్లకు, కోల్ శాంప్లింగ్, అండర్ గ్రౌండ్ వర్కర్స్‌కు స్కిల్డ్ వేతనాలు, లారీ డ్రైవర్స్‌కు, వోల్వో డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, డ్రైవర్స్ కు ఔట్ స్టేషన్ డీఏ రూ.300/ చెల్లించాలని ఒప్పందం జరిగిందని, కానీ రెండు ఏండ్లు అవుతున్నా సింగరేణి యాజమాన్యం అమలు చేయకుండా కాంట్రాక్ట్ కార్మికుల దరిని శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. జీఓ నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

# ప్రమాదకరంగా మూలమలుపులు.. భయాందోళనలో వాహనదారులు



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడ్ నుండి అడవి శ్రీరాం పూర్,ముత్తారం వెళ్లే ప్రధాన రోడ్డు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరువైపులా చెట్లపొదలు దట్టంగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు ప్రయాణికులు జంకుతున్నారు. మూలమలుపు దాటే వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ముందుకు వెళ్లుతున్నారు. నిత్యం ఓడేడ్ మీదుగా అడవి శ్రీరాంపూర్ అక్కడ నుండి ముత్తారం అనేక మంది ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళుతుంటారు. అయితే రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగి రోడ్డు పైకి వచ్చాయి. దీంతో రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మండల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పలుమార్లు బస్సులు,ఆటోలు, ట్రాక్టర్లతో పాటు ద్విచక్రవాహనాలు ఢీకొని స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు.సుమారు రెండు కిలోమీటర్ల దూరం మేర మూలమలుపు రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరిగాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చెట్లను తొలగించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అక్కరకు రాని ప్రదేశాల్లో ప్రజాధనం వెచ్చించి చెట్లను తొలగిస్తున్నారు. కాని ప్రమాదకరంగా మారిన ముళ్ల పొదలను తొలగించడానికి అధికారులు ససేమిరా అంటున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. కనీసం ఉపాదిహామీ పథకంలోనైనా రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించే విధంగా కూలీలకు పనులు కల్పించిన బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండాచూడాలని వాహనదారులు వేడుకుంటున్నారు.



## పిడిఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం/బోధన్:**నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆటో నగర్ ఏరియాలో ఆదివారం పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆటోనగర్ ఏరియాలో బొలెరో వాహనంలో తరలిస్తున్న బి య్యాన్ని పట్టుకున్నామని బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ తెలిపారు. బొలెరో వాహనంలో 20క్వింటాళ్ల పిడిఎస్ రైస్ తరలిస్తుండగా పట్టుకొని పంచానామా చేసి కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు.

## ఒసిపి-2 ఉపరితల గని సందర్శన



**ప్రజాపక్షం/రామగిరి:**రామగుండం3 ఏరియా లోని ఓసిపి2 ఉపరితల గనిని ఆదివారం డైరెక్టర్ ఇ&ఎం మరియు ఆపరేషన్స్ డి.సత్యనారాయణ రావు సందర్శించారు. వారు వ్యూ పాయింట్ నుండి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. యంత్రాల వినియోగించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు తీసుకుంటున్న భద్రత చర్యలు, ప్రణాళికల వివరాలను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు డైరెక్టర్ కి వివరించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ గారు మాట్లాడుతూ ఓ.బి(మట్టి వెలికితీత) రోజువారి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, యంత్రాలను పూర్తి స్థాయి లో వినియోగించి, బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా సాధించడానికి ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు.వారితో పాటు ఏరియా ఇంజనీర్ వై.విజయశేఖర్ బాబు, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్ర శేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, అడిషనల్ మేనేజర్ కోల శ్రీనివాస్, సర్వే అధికారులు తోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటులో పొరపాట్లను సరిదిద్దాలి

* రైతుల సమస్యలు తీర్చాలి
* టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ డిమాండ్




**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** ఉపాధ్యాయులకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సర్దుబాటులో పొరపాట్లను సరదిద్దాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయాల్సిన అధికారులు ఇష్టారీతిన చేసి ఇబ్బందులు పెడుతున్నారని వెంటనే అలాంటి సర్దుబాటులో జరిగిన తప్పులను సరిదిద్దాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం టిపిటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతు సమస్యలను తీర్చాలని వారు అనేక ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అదే విధంగా ఉపాధ్యాయుల సమస్యలు కూడా తీర్చాలని కోరారు. సుప్రీం కోర్టు సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఉమ్మడి సర్వీస్ నిబంధనల సమస్యను పరిష్కరించాలన్నారు. పెండింగ్లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిర్ణీత గడువులో పిఆర్సి రిపోర్ట్ తెప్పించి వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ విధానం రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వారి స్థానికత ఆధారంగా జిల్లాలకు కేటాయించాలని అకారణంగా నిలిపివేసిన 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామన్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి అందరికి నాణ్యమైన సమాన విద్య అందించాలని వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించి, రైతు ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఆదోని మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దోర్నాల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రామనాథ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు గుజ్జునేని వేణుగోపాల్ రావు, జిల్లా ఉపాధ్యాక్షులు పురం వాసుదేవరావు, విక్కుర్తి అంజయ్య, హన్మంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ కాగజ్నగర్ రూరల్:**కాగజ్నగర్ మండలం ఈస్గాం నజ్రూల్నగర్ విలేజ్ నెం.2కు చెందిన దిలీప్ మెస్త్రీకి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ ఇంచార్జి జడ్పి చైర్మన్ కోనేరు కృష్ణారావు చేతుల మీదుగా అందజేశారు. దిలీప్ మెస్త్రీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్లో చికిత్స పొంది సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా సిర్పూర్ మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప సహకారంతో మంజూరైన 48 వేల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం కాగజ్నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు షబ్బీర్ ఉన్నారు.

## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి




**ప్రజాపక్షం/నస్పూర్:**కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలని కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ కమిటీ జాతీయ అధ్యక్షులు జెర్రిపోతులు పరుశురాం అన్నారు. ఆదివారం కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ చలో ఢిల్లీ పోస్టర్లను నస్పూర్ ప్రెస్ క్లబ్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోని ముద్రించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఢిల్లీ లోని జంతర్ మంతర్ లో జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, సంజీవ్, కనకరాజు, రాంబాబు, నక్క శ్రీనివాస్ అయితే పరమేష్, రమేష్, రామచందర్, సత్యం, పోచం తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి రద్దు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో సోమవారం రోజు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు.సమగ్ర సర్వేలో ప్రజలు అధికారులకు పూర్తి సమాచారం అందించి సహకరించాలని కోరారు.ప్రజావాణి రద్దు చేయడంతో ప్రజలెవరూ సోమవారం కలెక్టర్ కార్యాలయానికి రాకూడదని,సర్వేలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే..

### సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్యామలదేవి..



**ప్రజాపక్షం/తలమడుగు:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే తలమడుగు మండలంలోపి ఆయా గ్రామల పంచాయతీ పరిధిలో కొనసాగింది ఇందులో భాగంగా మండలంలోని ఖోడద్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.అదే విధంగా మండలంలోని రుయ్యడి,ఉండం,అర్లికే,బరంపూర్,నర్సాపూర్,సకినాపూర్ తదితర గ్రామాలలో మండల ప్రతేక అధికారి గజానాన్,తహసీల్దార్ రాజా మోహన్,ఎంపిడిఒ చంద్రశేఖర్,డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్,మండల విద్యాధికారి వెంకట్ రావు,ఎపిఎంచంద్రశేఖర్,ఆర్ఐరోహిదాస్ఎన్యూమరేటర్లు ఉన్నారు.

## మేడారం సెక్షన్ పరిధిలో ఆవులపై పులిదాడి

### జాగ్రత్తలపై గ్రామస్థులకు అటవీ శాఖ అవగాహన



**ప్రజాపక్షం/కాసిపేట:**రాత్రి సమయంలో పంట పొలాలకు వెళ్లేవారు ఎవరినైనా తోడు తీసుకువెళ్లాలని, పెద్ద పులి సంచరిస్తున్న సరిహద్దు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారి (ఎఫ్బిఒ) శ్రీధర్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ముత్యం పల్లి సెక్షన్ పరిధిలోని పెద్ద ధర్మారం, గురువాపూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి కొద్ది రోజుల నుండి సంచరిస్తున్న సందర్భంగా గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి చేనులో పత్తి సేకరించే క్రమంలో చప్పుడు చేసుకుంటూ ఒకరికి ఒకరు ఎదురెదురుగా ఉండేట్టు చూసుకోవాలని, పశువులను మేపే వాళ్లు అటవీ ప్రాంతంలో వెళ్లరాదని తెలిపారు. వన్యప్రాణుల దాడిలో మృతి చెందిన పశువులకు నష్టపరిహారం చెల్లించామని, వన్య ప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టరాదని కోరారు. ఈ కార్యక్రమంలో వాచర్లు లక్ష్మణ్, సమ్మయ్య పోషం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 12న లక్షదీపోత్సవ కార్యక్రమం

**ప్రజాపక్షం/కాగజ్నగర్రూరల్:**కాగజ్నగర్ మండలంలోని ఈస్గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజల్లో భాగంగా కార్తిక శుద్ధ ఏకాదశి ఈనెల 12వ తేది మంగళవారం రోజున ఉదయం 5 గంటల నుండి లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఇఒ గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రమిదలు, వత్తులు. దీపం నూనె విరాళంగా సమర్పించు భక్తులు ఈనెల 11 సోమవారం రాత్రి 7 గంటల వరకు దేవాలయం నందు ఇవ్వాలని తెలిపారు. లోక కళ్యాణార్థం నిర్వహించు దీపోత్సవం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అదే విధంగా స్వచ్ఛందంగా తమ వంతు సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.